# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఈరోజు పర్యటిస్తున్నారు.**

**2.** **కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు 4.1' కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నిర్వహిస్తోంది.**

**3.** **కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే చిత్తూరు జిల్లాలో రేపు పర్యటిస్తారు.**

**4.** **అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.**

**5.** **ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు.**

=========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఈరోజు పర్యటిస్తున్నారు. ఈ మధ్యాహ్నం శాంతిపురం మండలం తుంశీలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు. ఈ సాయంత్రం తిమ్మరాజు పల్లిలో 'సుపరిపాలనలో – తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు 4.1' కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అనంతపురం, ఏలూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలలో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు ఆయా నియోజకవర్గాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషి వంటి అంశాలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లాలోని బుధవార పేటలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ. భరత్ మాట్లాడుతూ..

వాయిస్... 25 సెకన్లు

-------------------------

కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే చిత్తూరు జిల్లాలో రేపు పర్యటిస్తారని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అందించే సహాయ జీవన పరికరాలను కేంద్ర మంత్రి అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

---------------------------

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో నెల రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో అభివృద్ధి పనులను వివరిస్తామని మంత్రి తెలుపుతూ...

– వాయిస్... 34 సెకన్లు

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జలవనరులశాఖ అధికారులు ఈరోజు తెలిపారు. వర్షాలతో పాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరో వైపు దేవీపట్నం మండలం దండంగి, డి.రావిలంక గ్రామాల మధ్య రహదారిపై గోదావరి వరద ప్రవాహం పెరగడంతో గండి పోచమ్మ ఆలయం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు.

---------------------------

వర్షాకాలంలో సౌర విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. జెన్‌కో యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో నిన్న సమీక్షించారు. ఈ సంవత్సరం సగటు విద్యుత్ డిమాండ్ జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి వివరించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు.

---------------------------

ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. క్రీడా రంగ వార్తలను ప్రజలకు అందజేయడానికి క్రీడా పాత్రికేయులు చేస్తున్న కృషిని గుర్తించి... వారి పని తీరు మరింత మెరుగు పడేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1924వ సంవత్సరం జులై 2వ తేదీన ప్యారిస్లో జరిగిన ఒలింపిక్స్‌లో అంతర్జాతీయ స్పోర్ట్స్ ప్రెస్ అసోసియేషన్‌ను స్థాపించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతోంది. అయితే... ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవాన్ని 1994 సంవత్సరంలో ప్రకటించారు.

---------------------------

ప్రకాశం జిల్లాలోని ఒంగోలులో పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యుత్ శాఖ

ఉద్యోగులు ర్యాలీ చేశారు. అనంతరం సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీ కూడా అందిస్తున్నట్లు వివరించారు.

---------------------------

నంద్యాల జిల్లా శ్రీశైల దేవస్థానం లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చిందని నలుగురు వ్యక్తులు ఫిర్యాదు చేశారని.. దీనిపై విచారణ చేశామని పేర్కొంటూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు ఈరోజు నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మండల విద్యాధికారులు పాఠశాలను సందర్శించి నివేదికను పంపించాలని పాఠశాల విద్యాశాఖ ఈమేరకు ఆదేశించింది. జులై మూడో వారంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, ఆగస్టు 4 నుంచి ఫార్మెటివ్-1 పరీక్షలు నిర్వహించాలని సూచించింది.

---------------------------

శ్రీకాళహస్తి - నడికుడి రైల్వే మార్గంలో ఈనెల నాలుగో తేదీన తొలి రైలు నడుస్తుందని గుంటూరు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నెమలపురి, రొంపిచర్ల రైల్వే స్టేషన్లలో టికెట్ల విక్రయ కేంద్రాలను రైల్వే శాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రైలు జులై నాలుగవ తేదీ నుంచి వారానికి ఒకసారి నడుస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. వసతి గృహాల నిర్వహణపై ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వసతి గృహాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. వసతి గృహాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పాటు విద్యార్థులకు సన్న బియ్యం భోజనంతో కూడిన అందిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

=====================